# మినీ కథలు

## ఇంగ్లీష్ అత్తగారు

అల్లుడుగారు వంటగకొస్తే పాపం కనీసం అద్దంలో ముఖం చూసుకోడానికి కూడా తీరిక దొరకని "తెలుగు అత్తగార్ల"కో "ఇంగ్లీష్ అత్తగారి" కథ —

ఆ రోజే షర్లీ కూతురు ట్రేసీ తను పెళ్ళి చేసుకోబోయే బాయ్ ఫ్రెండ్ స్టీవ్‌ను ఇంటికి తీసుకొచ్చి తన తల్లిదండ్రులకు పరిచయం చేస్తానన్నరోజు. రాత్రి సప్పర్‌కి పిలిచా రతడిని.

ఆ రోజంతా ఉదయం నుండీ ఒకటే హడావుడి పడిపోతూంది షర్లీ. ఇల్లంతా క్లీన్ చేసి. నీట్‌గా సర్ది. వాజ్‌లోకి ఫ్రెష్ పూలు పెడ్దామని గార్డెన్‌లోకి వెళ్తే చెట్ల నిండుగా పూసిన పూలు కోయాలనిపించలేదు. వెంటనే భర్త ఆఫీసుకు ఫోన్ చేసి త్వరగా రమ్మని. వస్తూ దారిలో తాజా పూలు కొనుక్కు రమ్మని పురమాయించి ఆ రోజు కోసం తనేం డ్రెస్ వేసుకోవాలా అని వార్డ్‌రోబ్ అంతా వెతికి చివరికి డీప్ పింక్ డ్రెస్ తనకు సూటవుతుందా? అనుకుంటూ నిలువుటద్దంలో చూసుకుంటున్న షర్లీకి చటుక్కున- చిన్నప్పట్నుంచీ కొనాలనుకుని టైమ్‌లేక ఈ రోజైనా తీరిక చేసుకుని కొనాలనుకున్న అతి ముఖ్యమైన వస్తువు-గుర్తొచ్చి టైమ్ చూసుకుంది— నాలుగవుతూంది. షాపులు మూసెయ్యడానికింకో గంట టైముంది.

షాపింగ్ ముగించుకుని వచ్చి అన్నీ సరిగా వున్నాయాని చూసుకుని, తన అలంకరణ ముగించుకుని చివరిసారిగా ఫైనల్ టచెస్ కోసం అద్దంలో చూసుకుంది. పింక్ కలర్ డ్రెస్‌లో తనకు తనే అందంగా అనిపించింది. నీలిరంగు కళ్ళు బంగారు రంగు ఉంగరాల జుట్టుతో పోటీపడ్తున్నాయి అందంలో.

అప్పుడే ఆఫీసునుండి వచ్చిన ఆమె భర్త ఆమెను అప్పుడే క్రొత్తగా చూస్తున్నట్లుగా నిలబడిపోయాడు. అతడిఆశ్చర్యం గమనించి అడిగిందామె "హౌ డు ఐ లుక్" అంటూ. "మార్వలెస్. మోస్ట్ బ్యూటిఫుల్" అన్నాడతను ఆశ్చర్యంలోంచి తేరుకుని.

ట్రేసీ తన బాయ్‌ఫ్రెండ్ స్టీవ్‌ను పరి



— మాచర్లశోభ

చయం చేయగానే కాబోయే అల్లుడు గారికి షేక్‌హాండ్ ఇస్తూ. "నైస్ టు మీట్ యు" అంది షర్లీ. స్టీవ్ మాత్రం షర్లీనే మెచ్చుకోలుగా చూస్తూ ట్రేసీతో అన్నాడు. "యువర్ మమ్ ఈజ్ యంగ్ అండ్ బ్యూటిఫుల్" అని.

స్టీవ్‌తో పరిచయం. సప్పర్ ఆనందంగా ముగిశాయి. షర్లీ వంట ఎంతగానో మెచ్చుకున్నాడు స్టీవ్. ఆమె అందాన్నికూడాచాలా సార్లు పొగిడాడతను. ముఖ్యంగా ఆమె తలకట్టు. జుట్టు రంగు. స్టైయిల్ చాలా బాగున్నాయన్నాడు. ఇంకో పదేళ్ళు ముందు పుట్టి ఉంటే షర్లీనే పెళ్ళిచేసుకునే వాడినని ట్రేసీతో జోక్ కూడా చేశాడతను. చివరిగా వీడ్కోలు తీసుకుంటూ అంత అందమైన అత్తగారికోసమైనా తను ట్రేసీనే పెళ్ళి చేసుకుంటానని చెప్పాడు.

ట్రేసీ కూడా వెళ్ళిందతడితో సినిమాకని. వాళ్ళు వెళ్ళగానే ప్రొద్దుట్నించీ పనితో అలిసిపోయి ఉందేమో షర్లీ తన అలంకరణ అంతా తీసేసి నైటీ వేసుకుని కాస్త రిలాక్సవుతూ టి. వి. ముందు కూర్చుంది.

అంతలోనే సడన్‌గా తలుపు తీసుకుని ట్రేసీ. వెనకాల స్టీవ్‌కూడా వచ్చారు ఏదో మర్చిపోయామంటూ.

"హలో ఐ కేమ్ టు సీ యు ఆగేన్" అంటున్న స్టీవ్ మాటలు మధ్యలోనే ఆగిపోయాయి, ట్రేసీ వేసిన లైట్ వెల్తురులో షర్లీని చూసేసరికి. అందమైన బంగారు రంగు ఉంగరాల జుట్టు స్థానంలో సగం నెరిసిన పల్చటిజుట్టు. నోటమాట రానంత ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసి నిల్చున్న స్టీవ్‌ను చూసి తను విగ్గు అప్పుడే తీసేసిన విషయం గుర్తొచ్చి సిగ్గుతో కందిపోయింది షర్లీ ముఖం.

తన మధ్యాహ్నం పెళ్ళి కొనుక్కున్న విగ్గు గురించి ఇప్పటికీ ఆమె భర్తా.అల్లుడూ జోక్ చేస్తుంటారట. ●

---

ఆ రోజు షర్లీ తన కూతురుకు పాప పుట్టింది, చూడడానికి రమ్మంటే వెళ్ళాము నేనూ, అప్పుడే క్రొత్తగా ఈ దేశం (ఇంగ్లండ్) చూడడానికి వచ్చిన మా మామయ్యగారూ.

మేము వెళ్ళే సరికి చాలామంది వాళ్ళ చుట్టాలు. స్నేహితులు సిటింగ్ రూమ్ నిండా ఉన్నారు. మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి కూర్చోమని చెప్పి అక్కడి వాళ్ళందరినీ పేరు పేరునా ఒక్కొక్కరినీ పరిచయం చేసి. లోపలి రూమ్‌లోంచి గర్వంగా తన మనుమరాలిని తీసుకొచ్చి చూపించింది షర్లీ. తెల్లగా లావుగా. ఒక్క వెంట్రుకైనా లేని గుండుతో. ఎర్రని చిన్ని నోరుతో ముద్దుగా ఉన్న పాపను చేతుల్లోకి తీసుకుని పాపకోసం కొన్న చిన్న ప్రెజెంట్ పాప తల్లి కిస్తూ అడిగాను. పాప పేరేమిటని.

"హాలీ" చెప్పిందామె.

పాప పుట్టినప్పుడు తన కూతురుకెంత కష్టమయిందీ. అర్ధరాత్రి అయినా అంబులెన్స్ ఎంత త్వరగా వచ్చిందీ. హాస్పిటల్‌లో ఎంత సౌకర్యంగా వుందీ. డాక్టర్లెంత శ్రద్ధ తీసుకుందీ అంతా వర్ణించి చెప్పసాగింది షర్లీ. తర్వాత పాప పోలికలు. రంగు. పేరు గురించి చర్చించుకోసాగారంతా. ఆ చర్చ అలా సాగిసాగి ఇండియా వేపు మళ్ళింది. ఇండియాలో పేరు ఎప్పుడు పెడ్తారు బారసాల ఎంత ఘనంగా చేస్తారు వగైరా వగైరా అడిగి అడిగి తెల్సుకున్నారు వాళ్ళంతా. ఎవరో అడిగారు మా మామయ్యగారి ప్రయాణం గురించి.ఇక్కడికీ. ఇండియాకీ వున్న వాతావరణ భేదానికి ఎలా ఫీలవుతున్నారని. ఇక్కడి చలికి వేడి టీ. కాఫీ త్రాగాలనిపించినట్లే అక్కడి ఎండలకు చల్లటి మంచినీళ్ళు. కూల్‌డ్రింక్స్ ఎన్ని త్రాగినా చాలవని చెప్పారుమామయ్యగారు ఇండియా ఎండలను వర్ణిస్తూ. అంతలోనే ఎవరో అన్నారు. "కమాన్ లెట్స్ హావ్ సమ్ హాట్ టీ" అంటూ. "విల్ యు మేక్ సమ్ టీ ప్లీజ్?" అడిగింది. షర్లీ అప్పుడే లోపలి

కొచ్చి తన ప్రక్కన కూర్చున్న ఓ యువకుడిని ఉద్దేశించి. అతడు పేరుపేరునా అందర్నీ కాఫీ కావాలా, టీ కావాలా, బ్లాక్ కాఫీనా, వైట్ కాఫీనా- అడుగుతూ ఎన్ని కప్పులు కాఫీనో, ఎన్ని కప్పులు టీనో లెక్కపెట్టుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళాడు.

క్షణంలో అందరికీ కాఫీ, టీతోపాటు మినీ కేక్స్, బిస్కెట్స్ కూడా సర్వ్ చేశాడతడు. చివరగా అతడు తన టీ కూడా తెచ్చుకుని కూర్చున్నాడో లేదో హాలీ ఏడుపు మొదలెట్టింది. "ఐ థింక్ షి ఈజ్ హంగ్రీ" అంటూ లేవబోయింది షర్లీ కూతురు ట్రేసీ. అంతలోనే షర్లీ "హావ్ యువర్ టీ ట్రేసీ" అని, "ప్లీజ్! ఫీడ్ ద బేబీ మై డార్లింగ్ స్టీవ్" అంటూ ఇందాక టీ ఇచ్చిన యువకుడి కేసి చూసింది. పాలు కలిపి తెచ్చి పాపను ఒడిలోకి తీసుకుని పాలు పట్టబోతుండగా అంది ట్రేసీ పాపకు నాపీ మార్చాలని. అతడు పాపను పైకి తీసికెళ్ళి (పైకి అంటే ఎక్కడికో అనుకోకండి బెడ్‌రూమ్‌లు పైనుంటాయిక్కడ) నాపీ మార్చి మళ్ళీ క్రిందికొచ్చి పాలుపట్టి పాప నిద్రపోగానే క్యారీకాట్‌లో పడుకోబెట్టి, అపుడుగానీ తన చల్లారిన టీ త్రాగలేదతను. తర్వాత అందరి కప్పులూ సాసర్లూ కలెక్ట్ చేసి ట్రే ట్రాలీలో కిచెన్‌లోకి తీసుకు వెళ్ళాడు.

మరో గంటసేపు ఇండియా విషయాలు, అక్కడి ఆచార వ్యవహారాలు, పెళ్ళిళ్ళు, సినిమాలు, మధ్యతరగతి మనిషి జీవితంలో అవి ఎలా ముడి వేసుకున్నవీ, ఇంకా ఎన్నెన్నో చలికాలపు ఉదయాలు, వేసవి కాలపు సాయంత్రాలు, మల్లెపూలు, మడి, పూజలు ఏవేవో మాట్లాడుతూ కూర్చున్నాము. నాకింకా కూర్చుని ఇండియా గురించి ఎంతో చెప్పాలని ఉంది. (వినేవాళ్ళుండాలే కాని-ఇండియాలో ఎక్కువ మాట్లాడనని పేరు తెచ్చుకున్న నేను ఇక్కడ మాత్రం ఎదుటివారికి విసుగొచ్చేదాకా ఇండియా గురించి చెప్పగలను.) కానీ స్కూలు నుంచి పిల్లలొచ్చే టైమయింది కాబట్టి అందరిదగ్గరవీడ్కోలు తీసుకున్నాము. కానీ ఇందాక మాకు టీ ఇచ్చినతను మాత్రం కనపడలేదు. "ఎవరో పాపం కష్టపడి ఇంతమందికీ టీ చేసి ఇచ్చాడు. షర్లీ వాళ్ళ బంధువులబ్బాయేమో మనం చెప్పకుండా వెళ్తే ఏం బాగుంటుంది" అన్నారు మావయ్యగారు. అదే విషయం షర్లీకి చెప్పి అతడికి మా థ్యాంక్స్ చెప్పమన్నాను. "ఇక్కడే వున్నాడు మీరే చెప్పండి" అంటూ కిచెన్‌లోకి తీసికెళ్ళింది మమ్మల్ని.

# ఇంగ్లీష్ అల్లుడుగారు




—మాచర్ల శోభ

షర్లీ ఏప్రన్ కాబోలు కట్టుకుని పాప పాల సీసాలు కడిగి స్టెరిలైజింగ్ యూనిట్‌లో పెడుతున్న అతడు షర్లీ పిలిచిన "స్టీవ్ డార్లింగ్" అన్న పిలుపుకు వెనుదిరిగి చూశాడు. మేము వెళ్తున్నామని, అతడు చేసిన టీ చాలా బాగుందని, థ్యాంక్స్ అని చెప్పి సెలవు తీసుకున్నాము. "యు ఆర్ వెల్‌కమ్" అంటూ చిరునవ్వుతో "బై" చెప్పాడతను.

"హూ ఈజ్ హి?" అడిగాను షర్లీని బైటికొచ్చిం తర్వాత- షర్లీతో రెండేళ్ళ పరిచయమున్నా నేనెప్పుడూ చూడలేదతడిని. "యూ మీన్ స్టీవ్?" అంది షర్లీ. అవునన్నాను. "డోంట్ యు నో! హి ఈజ్ మై సన్ ఇన్లా. ఐ థాట్ యు ఆల్‌రడీ న్యూ హిమ్! దట్స్ వై ఐ డిడ్‌నాట్ ఇంట్రడ్యూస్ యు" అంది షర్లీ నొచ్చుకుంటూ.

"యువర్ సన్ ఇన్లా!" ఒకేసారి ఆశ్చర్యంగా అన్నాము నేనూ, మా మామయ్యగారూ. మా మామయ్యగారైతే ఇంటికొచ్చినా ఆ ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు "పాపం అల్లుడితో ఎంతపని చేయించింది" అన్నారు నొచ్చుకుంటూ-బహుశా తెలుగు అల్లుడిని తల్చుకుని కాబోలు!

ఇండియాలో అల్లుడుగారు అత్తవారింటికొస్తే కాలు క్రింద పెట్టనివ్వకుండా ఎన్ని రాచరికపు మర్యాదలు చేస్తారో గుర్తు చేసుకుంటూ "హౌ లక్కీ యు ఆర్ తెలుగల్లుడూ!" అనుకున్నాను ఇంగ్లీషల్లుడిమీద కూస్తంత జాలి పడుతూ. (పడాల్సిన అవసరం లేదనుకోండి).